

శిథిలావస్థలో ఆరోగ్య కేంద్రం



ఆరోగ్య ఉపకేంద్రంలో భవనం పెచ్చులూడుతున్న దృశ్యం


ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి రూరల్ మండలం తడుకు పంచాయతీలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరుకొంది. సుమారు 150 కుటుంబాలు ఉన్న ఈ పంచాయతీలో ఆరోగ్య ఉపకేంద్రం ఎంతో ముఖ్యమైంది. బుధ, శనివారం నిత్యం వైద్యపరీక్షలు చేస్తుంటారు. అయితే భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది, గర్భవతులు, బాలింతలు భయపడుతున్నారు. రెండు రోజులు కురిసిన వర్షానికి భవనం లోపల భాగంగా పూర్తిగా తడిచిపోయింది. పై కప్పులు పెచ్చులూడుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా స్థాయి అధికారులు స్పందించి భవనాన్ని మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

పాఠశాలలో నాడు- నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లి పాఠశాలలో నాడు- నేడు పనులను టిడిపి మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి, టీడిపి నేతలతో కలిసి పరిశీలించారు. గతంలో జరిగిన నాడు -నేడు పనులు నాణ్యత, అవినీతికి చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. అసంపూర్ణంగా ఉన్న పనులు, నాణ్యత లేని పనులపై అధికారులచే విచారణ జరిపి అక్రమాలపై త్వరలోనే చర్యలు తీసుకొనేల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నేతలు తెలిపారు. సకాలంలో పనులు ప్రారంభించి పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిరెడ్డి, కామరాజు నాయక్, రఘు, గంగాధరం, నాగరాజు, మురళి, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి





ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: పొట్టి శ్రీరాములు వర్ధంతి చిత్తూరు పివికే అండ్ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తెలుగువారి గుండెల్లో అమరజీవిగా ఎల్లప్పుడూ పొట్టి శ్రీరాములు బ్రతికే ఉంటారని పివికేఎన్ చరిత్ర అధ్యాపకులు రెడ్డిబాషా తెలియజేశారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అని, శాంతియుత మార్గంలో రాష్ట్రాన్ని సాధించిన గొప్ప దార్శనికుడు అని పివికేఎన్ సూపరింటెండెంట్ విజయకుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో యువత నడవాలని నాన్ టీచింగ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ తెలిపారు. నాన్ టీచింగ్ జిల్లా సెక్రటరీ రసూల్ బాషా కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పొట్టి శ్రీరాములు త్యాగఫలమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అవతరణకు ఆస్కారమని మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉపాధ్యాయులు లక్ష్మీపతి, మురళి కృష్ణ, సిఆర్‌పి సుశీల, ప్రేమలత పాల్గొన్నారు.

పలమనేరు: స్థానిక మున్సిపల్ ఆఫీసులో ఆదివారం మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 72 వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష, నిస్వార్థ త్యాగఫలితమే మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అని, ఆయన సేవలను కొనియాడారు. అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహ ప్రియ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.





కుప్పం టౌన్ : పట్టణం పురపాలక సంఘం కార్యాలయంలో ఫ్లోర్ లీడర్ జిమ్ దాము ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాసరావు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, కూటమి నాయకులు శివశంకర్, నరేష్, పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్‌కుమార్, సురేష్, సోము, నాయకులు డాక్టర్ వెంకటేష్, వేలు, సత్యేంద్ర శేఖర్ పాల్గొన్నారు.

వివక్ష వద్దు.. సహకరించాలి..

కేరళ సంఘీభావ సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

కేరళలో వామపక్ష ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించకుండా వివక్ష పాటిస్తున్నప్పటికీ దేశంలోనే రోల్ మోడల్‌గా కేరళ నిలిచిందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. ఆదివారం తిరుపతి నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేరళ సంఘీభావ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా నర్సింగరావు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వామపక్ష ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించడమే కాకుండా నిధులు ఇవ్వకుండా వామపక్ష ప్రభుత్వాన్ని పడగొట్టే చర్యలు పూనుకుందని దీన్ని మేధావులు ప్రజాస్వామ్యవాదులు అడ్డుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భూ సంస్కరణలు అమలు చేసి ప్రతి పేదవాడికి భూమి పంచడం జరిగిందన్నారు. కార్మికులకు కనీస వేతనము కార్మికులకు రూ.26 వేలు ఇస్తున్న రాష్ట్రం కేరళనేనని పేర్కొన్నారు. చౌక దుకాణాల ద్వారా పేద ప్రజలకు 16 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తోందని, వీటి ద్వారా పేదలకు మూడు పూటల తిండి దొరుకుతోందని అన్నారు. విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు 100 శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రం కేరళ అన్నారు. కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రం విమానాశ్రయాన్ని అదానికి అప్ప చెప్పడానికి పూనుకుంటే వామపక్ష ప్రభుత్వం దాన్ని అదానికి ఇవ్వకూడదని నిలదీయడం జరిగింది. అయితే కేంద్ర ప్రభుత్వం వామపక్ష ప్రభుత్వం మాట వినకుండా ఇవ్వడానికి పూనుకుంటే వామపక్ష ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందన్నారు. కేరళలోని భారత పెట్రోల్ సంస్థను లాభాలు వస్తుంటే వాటిని కూడా ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడానికి కేంద్రం పూనుకుందని, అయితే వామపక్ష ప్రభుత్వం ప్రవేట్ వ్యక్తులకు ఇవ్వకుండా తామే నిర్వాహణ చేసుకుంటామని ప్రకటించడం జరిగిందన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్ వామపక్ష ప్రభుత్వాలను నిధులు ఇవ్వకుండా అటు మతోన్మాదాన్ని పెంచి పోషించి కేరళలో మతోన్మాదులు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి రకరకాల కుట్రలు పన్నుతున్నా అక్కడ ప్రజలు ఐక్యంగా ఉండి అడ్డుకుంటున్నారని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.


ఇంటి చుట్టూ వర్షపు నీరు



ప్రజాశక్తి- విజయపురం(నగరి): నగరి రూరల్ మండలం వీకేఆర్‌పురం పంచాయతీ వర్షపు నీటిలో ఉంది. సుమారు 60 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో కనీస వసతులు లేవు. మురికి కాలువలు లేక, వర్షపు నీరు బయటకు వెళ్లడానికి దారిలేక ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నిలిచిపోయింది. వర్షం ఆగి రెండు రోజులు అవుతున్న నీరు వెళ్లలేదు. దీంతో వర్షపు నీటిలో విషసర్పాలు, పాములు, తేలు ఉంటాయని స్థానికులు అడుగు బయట పెట్టడానికి భయపడుతున్నారు. వర్షపు నీటిలో మునిగి ఉన్న పంచాయతీని అధికారులు ఇంత వరకు వచ్చి చూడలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఫీసుల్లో కూర్చొని జిల్లా అధికారులు తప్పుడు సమాచారం ఇస్తూ కాలయాపన చేస్తున్నారని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. నీటిలో నడిచి కాళ్ల పుండుపట్టి, జ్వరం భారిన పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులుగా హరిప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా డిగ్రీ కళాశాల బోధనేతర సిబ్బంది అసోసియేషన్ ఎన్నికలు పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ ఎన్నికల్లో గౌరవాధ్యక్షులుగా దొరై కన్నన్, పివికేఎన్ సీనియర్ సహాయకులు హరిప్రసాద్ గారు అధ్యక్షులుగా, కుప్పం డిగ్రీ కళాశాల సీనియర్ సహాయకులు విద్యాసాగర్ సెక్రటరీగా, జాయింట్ సెక్రటరీగా రసూల్ బాషా పివికేఎన్ డిగ్రీ కళాశాల, ట్రెజరర్‌గా కమల్ బాబు వాయల్పాడు డిగ్రీ కళాశాల ఎన్నికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ నాన్ టీచింగ్ సంబంధించిన సంక్షేమం కోసం పాటుపడతామని, నాన్ టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు.



అటవీ సమీప ప్రాంతాల్లో ఏనుగులు హల్‌చల్

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఆవులపల్లి పంచాయతీ పత్రపల్లి గ్రామ సరిహద్దు అటవీ ప్రాంతంలోని పంట పొలాలపై శనివారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసిందని, పంట పొలాలకు కావలిగా ఉన్న రైతులు వాపోయారు. వరి, టమోటా, అరటి పంటలపై దాడి చేసి నాశనం చేసిందని రైతులు తెలిపారు. రాత్రి టార్చి లైట్లు వెలుతురులో ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమేసినట్లుగా రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఉదయం పొలాల వద్దకు వెళ్లి పరిశీలించి రైతుల వివరాలు సేకరించారు. ఏనుగుల నుండి మీకు రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపినట్లు రైతులు చెప్పారు.



కుప్పంలో ఏనుగులు తొక్కి నాశనం చేసిన పంటను చూపుతున్న రైతు


కుప్పం రూరల్ : కుప్పం మండల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతాలలో ఏనుగుల సంచారం గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తుంది. మండల పరిధిలోని గుడ్లనాయనపల్లి పంచాయతీ ఊరినాయనపల్లి గ్రామపరిధిలో ఆదివారం తెల్లవారి జాము మూడు గంటల సమయంలో ఏనుగుల గుంపు తిరుగుతున్నట్లు గ్రామస్తులు గుర్తించినట్టు తెలిపారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న తమ గ్రామంలో సంచరించిన ఏనుగులు పంట పొలాలపై వెళ్లడంతో పంట నష్టం వాటిల్లిందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అలాగే గ్రామాల పరిధిలో పర్యటిస్తున్న ఏనుగుల గుంపును దారి మళ్లించి, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ఒంటరి ఏనుగును తరిమి వేస్తున్న రైతులు



జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం







జాతీయ స్థాయి బేస్ బాల్, సాఫ్ట్ బాల్, స్కూల్ గేమ్స్ పోటీలకు మండలంలోని రాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు సుజాత, పీడీ దశరథ తెలిపారు. బేస్ బాల్ అండర్-14 స్కూల్ గేమ్స్ పోటీలకు బాలికల విభాగంలో జి. నిరోషా, బాలురు విభాగంలో కే. నవీన్ కుమార్, సాఫ్ట్ బాల్ అండర్-14 పోటీలకు బాలికల విభాగంలో వి.సోనియా, స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి పోటీలకి ఎంపికయ్యారని తెలిపారు. వీరుఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు చత్తీస్ గడ్ రాష్ట్రం బిలాస్ పూర్‌లో జరిగే అండర్-14 జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు మన రాష్ట్రం తరపున జి.నిరోషా, కే.నవీన్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తారని అలాగే జనవరిలో మహారాష్ట్రలో జరిగే సాఫ్ట్ బాల్ అండర్-14 బాలికల విభాగంలో మన రాష్ట్రం తరపున వి.సోనియా ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల పాధ్యాయులు, సర్పంచ్ శ్రీహరి, ఎస్ఎంసి చైర్మన్ హరి, బాలకృష్ణ అభినందించారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ప్రజాశక్తి- సోమల : సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువులకు సత్కారం నిర్వహించారు. 1985-86 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ నాడు చదువులు చెప్పిన గురువులకు మేళతాళాలతో పూలు చల్లుతూ స్వాగతం పలికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆసీనులను కావించారు. పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి ఆనాటి గురువులు పాపిరెడ్డి విజయకుమారి, రాయప్పరెడ్డి, వెంకటస్వామి హాజరయ్యారు. గురువులకు విద్యార్థులు దుస్సాలువలతో ఘన సన్మానం చేసి మెమెంటోలను అందజేశారు. అనంతరం గురువులు మాట్లాడుతూ విద్య అనేది ఎంత నేర్చుకున్న తరగని గని అని ఆనాడు తమ వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు తమను ప్రత్యేకంగా ఆహ్వానించి గౌరవించి మెమెంటోలను అందజేయడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. తమకు చదువులు నేర్పిన గురువులను సన్మానించడం వారి ఆశీస్సులు తీసుకోవడం తమకే కాకుండా తమ కుటుంబ సభ్యులకు తమ పిల్లలకు వారి ఆశీర్వాదాలు అందజేయడం తమకెంతో ఆనందదాయకంగా ఉందని పూర్వవిద్యార్థులు తెలిపారు. అనంతరం విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం తెచ్చుకొని ఆనందడోలికల్లో తేలి ఆడారు. కార్యక్రమంలో 40 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచులకు రెండు రోజుల శిక్షణ

ప్రజాశక్తి- సోమల : మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని సమావేశపు మందిరంలో ఈనెల 16, 17వ తేదీ రెండు రోజులపాటు స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎల్ఎస్‌డిజి) అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అన్ని పంచాయతీల సర్పంచులకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని ఉదయం 10 గంటల నుండి ప్రారంభం అవుతాయని ఎంపీడీవో నారాయణ తెలిపారు. నిర్దేశించిన అధికారులు తప్పక సమయపాలన పాటిస్తూ హాజరు కావాలని కోరారు.

గుడిపాల: గ్రామస్థాయి సిబ్బందికి మండలస్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివరాజు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌జిఎస్ఎ కార్యాచరణ ప్రణాళిక 2024-25పై స్థానికీకరణ సుస్థిర లక్ష్యాలపై గ్రామ పంచాయతీ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని నరహరి పేట ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఈ శిక్షణా తరగతులు ప్రారంభం అవుతాయని, తరగతులు 16,17 రెండు రోజులపాటు జరుగుతాయని తెలిపారు.

ఎస్ఆర్ పురం: సర్పంచులకు పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధి పై రెండు రోజులు శిక్షణా కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో మోహన్ మురళి తెలిపారు.16 , 17 తేదీల్లో రెండు రోజుల్లో మండల కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి స్థిరాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో మోహన్ మురళి తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన



చౌడేపల్లిలో..

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో సాయిమాత సేవా ట్రస్ట్ తరపున నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతంగా ముగిసినట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు. ఆదివారం జరిగిన వైద్యశిబిరానికి 120 మంది పాల్గొనగా వైద్యులు వారిని పరీక్షించిన 42 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. వీరందరికీ కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని శంకర కంటి వైద్యశాలలో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు తెలిపారు.



రామకుప్పంలో..

చౌడేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాలలో కోకో కోలా హెచ్‌సిసిబి, వై4డి ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో గ్యాస్టిక్, కంటికి సంబంధించిన జబ్బులతో పాటు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో దాదాపు 2007 మంది రోగులు పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. వైద్య శిబిరానికి డాక్టర్ వైష్ణవి, డాక్టర్ సౌమ్య హాజరయ్యారు. వీరితో పాటుగా ఎస్ఆర్ ఐ కేర్ ఆసుపత్రి (తిరుపతి) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోకో కోలా రిడో స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి రమణ, బ్యాంకు రెడ్డెప్ప, డాక్టర్ చంద్ర, ఆశ కార్యకర్తలు అనురాధ, లలితమ్మ, నాయనవారిపాలెం శ్రీరాములు, శెట్టిపేట సురేష్ వెంకట్రమణ పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలం సంగంపల్లి గ్రామంలో పిఈఎస్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక టిడిపి నాయకుడు పి.బాబు యూనిట్ ఇంచార్జ్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఉచిత బిపి, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, కడుపునొప్పి వివిధ రోగాలకు చికిత్స చేసి రోగులకు ఉచిత సలహాలు సూచనలు అందజేశారు.



గుడిపల్లిలో..

రామకుప్పం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పిఈఎస్ వైద్యశాల ఆధ్వర్యంలో 50 మందికి కంటి వైద్య చికిత్సలు అందించారు. ఆదివారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద కంటి రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇందులో 10 మందికి కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి కుప్పం పిఈఎస్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆలయ నిర్వాహకులు రోగులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు సంజన రెడ్డి, అనుపమ, శరణ్య, పిఆర్‌పి వెంకటేష్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సీతాపతి పాల్గొన్నారు.

సీతారామయ్యకు 'ఆదర్శ పౌరుడు' బిరుదు



ప్రజాశక్తి- పలమనేరు: విద్యాదాత శ్రీపురం సీతారామయ్య 88వ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్‌లో పట్టణానికి చెందిన అన్ని సంస్థలు కలిపి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తించి వారికి ఆదర్శ పౌరుడు బిరుదు పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం లయన్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఎన్జీ జీవో అసోసియేషన్, పలమనేరు పరిరక్షణ సమితి, పలమనేరు ప్రకృతి, జనవిజ్ఞాన వేదిక, వాసవి మహిళా మండలి, రసజ్ఞుల సమాఖ్య, పలమనేరు రచయితల సంఘం, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, రత్నా బయో లైఫ్, కన్యకా పరమేశ్వరి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. యుగంధర్, ఆర్.మాధవ్, నరేంద్ర, ఆనంద్ బాబు, మల్లిచెట్ల దేవేంద్ర, కుప్పరాజు, సత్యప్రకాష్, నరసింహులు శెట్టి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, సివి కుమార్, రామిరెడ్డి, డాక్టర్ రాజారెడ్డి, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి మౌలా, సుబ్రహ్మణ్యం పిళ్ళై , ఎంఈఓ బాల సుందరం, టిఆర్ విజయలక్ష్మి, దీపిక బాలాజీ, గిరిధరమూర్తి, పి.తులసీనాథం నాయుడు, పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పని చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పూతలపట్టు నియోజకవర్గంలోని నారాయణాద్రి కళ్యాణమండపంలో నియోజకవర్గ సర్వసభ సమావేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, అధికారం చేపట్టిన తర్వాత చెప్పిన హామీలను నెరవేర్చకుండా సూపర్ సిక్స్ అని ప్రజలను మోసం చేసి బౌండరీలను దాటించారని, సంక్షేమ పథకాల్లో విజయం సాధించలేక పథకాలను అమలు చేయలేక ఏదో ఒక కొత్త పుంతనాలను ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకులు భారీగా పెంచారని విద్యుత్ ఛార్జీలు కరెంట్ బిల్లు తాకితేనే షాక్ కొట్టే విధంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ ధనంజయ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప, మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి సోమశేఖర్, మండల కన్వీనర్లు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మాలల సింహగర్జనకు మద్దతుగా మాస్టర్లు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: మాలల సింహగర్జనకు మద్దతుగా కుప్పం పట్టణంలో ఉపాధ్యాయులు దళిత నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విగ్రహ ఆవరణలో బైఠాయించి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆపై పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విభజించి పాలించు అన్న ధోరణిని అవలంభిస్తూ ఆచరిస్తున్న ఎస్సీ వర్గీకరణ సబబు కాదన్నారు. ఐక్యమత్యమే మహాబలం అన్న ధోరణిలో వ్యవహరిస్తూ ఎస్సిలంతా కలిసికట్టుగా ఉంటూ, మన హక్కులను సాధించుకోవడానికి పోరాడాలని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మాలలు ఏకమై గుంటూరులో మాలల సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేళ వారికి సంఘీభావంగా కుప్పం పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వారు తెలిపారు. ఇప్పటికైనా న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ తీర్పుపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు, విశ్రాంత ఉద్యోగులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరంలో సంస్థాన్ హాధిస కాలం నుంచి కార్తీక మాసంలో నిర్వహించే జాతరను పురస్కరించుకొని ఆదివారం అమ్మవారికి బంగారమ్మ విగ్రహాన్ని గ్రామ విధులలో వైభవంగా ఊరేగించారు. ప్రతి ఇంటి దగ్గర భక్తులు కర్పూర అర్హతలు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే.ప్రసాద్ ఉపాధ్యక్షులు రంగనాథ మొదలి కార్యదర్శి చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోరా విద్యార్థులచే అమ్మవారికి సారే ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు కార్యక్రమం చేపట్టారు. చిన్నారి రాక్షస వేస్తం చిన్న నగర వీధిలో నివసించే చిన్నారులు విద్యార్థుల రాక్షస వేషధారణ పలువురుని ఆకట్టుకుంది. జాతర 17,18 సందర్భంగా శుక్రవారం నుండి వేషాలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా విశ్రాంతి ఉద్యోగులు సుబ్రహ్మణ్యం, రాజు, మధు ఆధ్వర్యంలో అమ్మవారికి పొంగల్లు పెట్టి మొక్కులు తీసుకున్నారు. పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ కృష్ణమ్మ రాజు, ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయ వర్మ సారెను అమ్మవారికి సమర్పించారు.



పూర్వ విద్యార్థులచే అమ్మవారికి సారె తీసుకెళ్తున్న దృశ్యం

తెలంగాణా ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్ ఎమ్మెల్యే కాసులవాద శంకరయ్యను ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ సస్పెండ్ చేసి అతని పై చర్యలు తీసుకోవాలని మండలంలోని వెలమ సామాజిక వర్గానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని శివాడి, అప్పినపల్లి, కుంబార్లపల్లి, రాజుపల్లె, పెద్దవెలగటూరు గ్రామాలకు చెందిన వెలమ కులానికి చెందిన పలువురు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం, షాద్ నగర్ ఎమ్మెల్యే కాసులవాద శంకరమ్య వెలమలను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో దూషించి అనుచిత వ్యాఖ్యాలు చేస్తూ దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. అతనిపై చట్ట పరమైన చర్యలు తీసుకుని తమ కులస్థుల మనోభావాలను కాపాడిలని ఎస్ఐ సహదేవికి షాద్ నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు.



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వెలమ కులస్తులు

అన్నదానం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మాధవనగర్‌లోని బ్రహ్మానంద ఆశ్రమంలో సత్యనారాయణ స్వామి పూజ పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి మాట్లాడుతూ కార్తిక పౌర్ణమి పురస్కరించుకున ఆశ్రమంలో సత్యనారాయణస్వామి వ్రతకల్ప పూజా కార్యక్రమాన్ని నిర్వహించామని, గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని అనంతరం అన్నదానం నిర్వహించినట్లు రాజశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, సుధాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు.

విస్తరణ రగడ

రోడ్డు విస్తరణను అడ్డుకున్న హైరోడ్డు భవన ఓనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: ట్రాఫిక్ ఇబ్బందులు నేపథ్యంలో హైరోడ్డు విస్తరణకు నగరపాలక సంస్థ అధికారులు ఆదివారం రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న భవన నిర్మాణాల కూల్చివేతకు పూనుకున్నారు. నష్టపరిహారం విషయం తేల్చకుండా ఏకపక్షంగా నగరపాలక సంస్థ రోడ్డు విస్తరణ పేరుతో భవనాల కూల్చివేతకు పూనుకోవడాన్ని హై రోడ్డు భవన ఓనర్స్ అసోసియేషన్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదివారం సింధు హోటల్లో నిర్వహించిన సమావేశంలో అభివృద్ధికి తాము ఆటంకం కాదని నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే విస్తరణ చేపట్టాలని కోరారు. హై రోడ్డులో భవనాలను కూల్చి వేస్తున్నారని సమాచారం తెలుసుకున్న వెంటనే ఓనర్స్ అసోసియేషన్ నాయకులు అక్కడికి చేరుకొని మున్సిపల్, పోలీసుల అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఓనర్స్ అసోసియేషన్ నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. చిత్తూరు డిఎస్పి ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడి కూల్చివేతలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. నష్టపరిహారం చెల్లించేంతవరకు కూల్చివేతలకు సహకరించబోమని చట్టపరంగా పోరాటానికి సిద్ధమవుతున్నట్లు హై రోడ్డు భవన ఓనర్స్ అసోసియేషన్ నాయకులు వెంకటేష్ , మనోహర్ నాయుడు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలి

హై రోడ్డు విస్తరణలో భవనాలను కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే విస్తరణ చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కన్వీనర్ గంగరాజు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణలో భవన నిర్మాణాలను కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి
- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్

రోడ్డు వెడల్పులో భాగంగా హై రోడ్‌లో షాపులను తొలగించే క్రమంలో వారికి నష్టపరహారం చెల్లించకుండా తొలగించడం సరైంది కాదని, నష్టపరహారం చెల్లించి పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆ పేరుతో ఎవరికీ నష్టం జరగకూడదని నష్టానికి ప్రతిఫలంగా నష్టపరహారం చెల్లించాలని కోరారు. ఏం చేసినా ప్రజాప్రయోజనాల కోసమే చేయాలి తప్ప ప్రజలకు నష్టం చేకూర్చే పని చేయకూడదని అన్నారు. సంవత్సరాల కొద్దీ షాపులు నమ్ముకుని జీవం సాధిస్తున్న వ్యాపారస్తులకు వెంటనే నష్టపరహారం చెల్లించాలని, వ్యాపారస్తులు అందరూ కూడా అభివృద్ధికి సహకరిస్తామని చెబుతున్న ప్రభుత్వం కూడా వారికి సహకారం అందించాలని కోరారు. వ్యాపారస్తులకు ప్రజలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు

నష్టపరిహారం చెల్లించాకే పనులు..
హైరోడ్డు భవనం యజమానుల సంఘం నాయకులు వెంకటేష్

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే హై రోడ్ విస్తరణ చేపట్టాలని హైరోడ్డు భవనం యజమానుల సంఘం నాయకులు వెంకటేష్ స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా భవన నిర్మాణాలకు పూనుకోవడం చట్ట విరుద్ధమన్నారు. నగరపాలక సంస్థ అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నష్టపరిహారం విషయాన్ని తేల్చకుండా రోడ్డు విస్తరణ పేరిట భవనాలను కూల్చివేతకు పూనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలను చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరణకు పూనుకోవాలన్నారు. 2017లో పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు చిత్తూరు హైరోడ్డు విస్తరణకు సంబంధించి భవన యజమానులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా భవనాలను కూల్చివేతను సహించబోమంటూ మున్సిపల్ అధికారులు జెసిబిలు తీసుకొచ్చి హై రోడ్డులో భవన నిర్మాణాల కూల్చివేతకు పూనుకోవడాన్ని అడ్డుకున్నారు.



రోడ్డు పనులు మొదలు పెట్టడంతో మున్సిపల్ అధికారులు, అసోషియేషన్ నాయకుల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేద్దాం..
ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

సోమవారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మేధావులు, ఉపాధ్యాయులు, యువత, విద్యార్థులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ కమిటీ ప్రతినిధులు, సంతపేట అభివృద్ధి కమిటీ, ఎన్జీవో సభ్యులు, వర్తక వ్యాపార సంఘాల ప్రతినిధులు, హెూటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కార్మిక అసోషియేషన్, రైతులు, డాక్టర్స్, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగ ప్రతినిధులు, ప్రైవేట్ సంఘాల ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయర్స్, అన్ని వర్గాల ప్రజలు తప్పక పాల్గొని చిత్తూరు అభివృద్ధికి మీ సలహాలు సూచనలు ఇవ్వాలని కోరుతూ సమావేశం నిర్వహించారు.

క్రైం న్యూస్

బియ్యం పట్టివేత



వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం గుండా తరలిస్తున్న తమిళనాడు అక్రమ బియ్యాన్ని కుప్పం పోలీసులు స్వాధీన పరుచుకుని, వాహనాన్ని అదుపులోనికి తీసుకోవడం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు రెండు లక్షల రూపాయల విలువ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తమిళనాడు నుంచి కర్ణాటకకు తరలిస్తున్నట్టు పోలీసులకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి, తరలిపోతున్న అక్రమ బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకోవడం జరిగిందన్నారు.

ఆలయంలో చోరీ

అమ్మవారి తాళిబొట్టు ..
హుండీ పగలగొట్టి నగదు అపహరణ



ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల వారపు సంత సమీపంలోని బోయకొండ అమ్మవారి ఆలయంలో పట్టపగలు ఆదివారం చోరీ జరిగినట్లు ఆలయ పూజారి కుటుంబ సభ్యులు గుర్తించారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆలయ పూజారి పూజ చేసుకుని వెళ్లారు. ఆ తర్వాత పూజారి భార్య ఆలయం సమీపంలోని తమ వ్యవసాయ పొలం వద్దకు వచ్చి తిరిగి వెళుతూ ఆలయం వద్దకు వెళ్లగా గర్భగుడి బీగాలు పగలగొట్టి ఉండటం, హుండీ పగలగొట్టి దొంగలు లోపలికి వెళ్లి చోరీ చేసినట్టుగా గుర్తించింది. వెంటనే సమాచారాన్ని భర్తకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు మూడుసార్లు బోయకొండ అమ్మవారి ఆలయంలో చోరీ జరిగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఆలయానికి నలువైపులా సీసీ కెమెరాలు కూడా బిగించినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం : సిఐ



ప్రజాశక్తి- పూతలపట్టు: హెల్మెట్ లేని కారణంగా అనేకమంది వివిధ ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు. హెల్మెట్ లేని ప్రయాణం అత్యంత ప్రమాదకరమని పూతలపట్టి సీఐ కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్, వాహనాలకు సంబంధించిన పత్రాలు, మద్యం తాగి వాహనాలు నడపడం, ఇద్దరుకు మించి ద్విచక్రమా వాహనాలపై వెళ్లడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్డు నియమ నిబంధనలను అధిగమించి వాహనాలు నడిపితే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు.

ప్రత్యేక రైలు ప్రయాణం నరకం..!

- తక్కువ దూరం ఉన్నా గంటల ప్రయాణం
- అధిక ఛార్జీల బాదుడు
- పాత రైళ్లు డొక్కు బోగీలు..

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: పండుగ వేళల్లో స్వస్థలానికి వెళ్లాలన్నా, సెలవు రోజుల్లో విహార యాత్ర వెళ్లాలనుకున్నా చాలామంది ప్రజలు రైలును ఆశ్రయిస్తారు. రైళ్లల్లో ప్రయాణించాలంటే అలసట ఉండదు.. సుఖంగా, ప్రశాంతంగా ప్రయాణించాలనే వారి కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తుంటారు. సాధారణ రైళ్లల్లో రిజర్వేషన్లు దొరకని వారు కొంత ఖర్చైనా రిజర్వేషన్ చేసుకుంటే బెర్త్ దొరుకుతుందని ప్రత్యేక రైళ్లను ఆశ్రయిస్తారు. అయితే ఆ ప్రత్యేక రైళ్ల ప్రయాణం ప్రయాణికులకు నరకంగా మారుతున్నాయి. సుమారు 200 కిలోమీటర్లు ప్రయాణించాలంటే నాలుగు నుంచి ఐదు గంటలకు సమయం పడుతుంది. దీంతో ప్రయాణికులు బేజారు చెందుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే ప్రత్యేక రైలు ఎప్పుడు ఏ ప్లాట్ ఫారంలో వస్తుందో తెలియదు. ఏ సమయంలో వచ్చేది కూడా ఆఖరి నిమిషం వరకు తెలియదు. ప్రత్యేక రైలు ప్లాట్‌ఫారం మీదికి వచ్చిన తర్వాత లగేజ్ అంతా తీసుకొని పరుగులు తీసి రైలు వచ్చిన ప్లాట్ ఫామ్ మారాల్సి ఉంటుంది. మార్గ మధ్యంలో ఎన్ని సార్లు ఆగుతుందో... ఆగినప్పుడు మళ్లీ ఎప్పుడు కదులుతుందో తెలియని పరిస్థితి. అధిక ఛార్జీలు చెల్లించి మరి ప్రయాణంలో ప్రత్యక్ష నరకాన్ని చూడాల్సిన పరిస్థితి. ప్రత్యేక రైలులో నెలకొన్నాయి. 12744 నెంబర్ కలిగిన తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా నడవడం పట్ల తిరుపతికి వచ్చే యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైలు ప్రతి రోజూ ఏదో ఒక సమయం కొంత ఆలస్యంగా వస్తోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

కాకినాడ నుంచి కొల్లం వరకు... ఈ నెల 11, 18, 25 తేదీల్లో కాకినాడ- కొల్లం (07173) ప్రత్యేక రైలు కాకినాడ పోర్టులో రాత్రి 11.50 గంటలకి బయలుదేరి రెండో రోజు ఉదయం 5.30 గంటలకు కొల్లం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లం-కాకినాడ (07174) ప్రత్యేక రైలు 13, 20, 27 తేదీల్లో కొల్లంలో ఉదయం 8.40 గంటలకు బయలుదేరి రెండోరోజు సాయంత్రం 4 గంటలకు కాకినాడ పోర్టుకు చేరుకుంటుంది. ఈ రైలుకు కొట్టాయం, ఎర్నాకుళం, త్రిసూర్, ఈరోడ్, సేలం, జోలార్ పేట్, కాట్పాడి, చిత్తూరు, తిరుపతి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, కాకినాడ టౌన్ స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ ప్రత్యేక రైలు కూడా సమయం రాక కొంత ఆలస్యంగా నడుస్తున్నాయని ఈనెల 13వ తేదీ ప్రయాణం చేసిన ప్రయాణికులు పేర్కొన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్లో ప్రత్యేక రైలు నడపాలంటేనే అధికారులకు సమస్య తలనొప్పిగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ప్రత్యేక రైళు నడపలేని పరిస్థితి వుంది. కొన్ని ప్రత్యేక రైళ్లు మాత్రమే నడిపిస్తున్నారు.



ప్రత్యేక రైళ్లపై తీవ్ర విమర్శలు

ప్రత్యేక రైళ్లపై ప్రయాణికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఛార్జీలు అధికంగా వసూలు చేయడంతో పాటు ప్రతి రోజూ నడిచే రైళ్లకు క్రాసింగ్ ఇచ్చేందుకు గంటల తరబడి స్టేషన్లలో నిలిపివేస్తున్నారని, దీనివల్ల అనుకున్న సమయానికన్నా చాలా చాలా ఆలస్యంగా గమ్యస్థానానికి చేరుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించారు. సరైన సమయానికే వీటిని నడుపుతున్నామని చెబుతున్నారు. కానీ వాస్తవంలో చాలా ఆలస్యమవుతున్నాయి. ఐదు గంటల జర్నీకే ఎనిమిది గంటల జర్నీ చేయాల్సి వస్తోందంటూ దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లల్లో ఎన్ని గంటలు అదనంగా జర్నీ చేయాలో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా ఛార్జీలు ఎక్కువగా తీసుకుంటూ ఆలస్యంగా తీసుకువెళుతున్న రైళ్ల సమయ పాలనను మార్చాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

వృద్ధులు వికలాంగులు ఇబ్బందులు

దక్షిణ మధ్య రైల్వే ప్రధాన మార్గాలకు అధికంగా డిమాండు వుంది. సెలవు రోజుల్లో అధికంగా కనిపిస్తుంది. ఇలాంటి సమయంలో ప్రయాణికులకు అవసరాలకు అనుగుణంగా రేకుల రైలు వేయాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేక రైలు అంటే పండుగలు , వేసవి సెలవు రోజుల్లో ఉంటాయి. దక్షిణ మధ్య రైల్వే మాత్రం వివిధ మార్గాల్లో అనేక సంవత్సరాలు నుంచి ప్రత్యేక పేరుతో రైళ్లను నడిపిస్తుంది. రెగ్యులర్‌గా మారిస్తే సాధారణ ఛార్జీలు వసూలు చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక రైలు నడిపిస్తే అదనపు ఛార్జీలు వసూళ్లకు వెసులుబాటు ఉంటుంది. ఈ ప్రత్యేక రైల్లో ప్రయాణంలో అంతులేని జాప్యం అవుతూ ఉండడంతో వృద్ధులు వికలాంగులు చంటి పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాత రైళ్లు.. డొక్కు బోగీలు

నడుపుతున్న ప్రత్యేక రైళ్లలో ఎక్కువగా పాత రైళ్లు డొక్కు బోగిలే అధికంగా ఉంటున్నాయి. ఈ రైళ్లలో మరో దొడ్లల్లో నీళ్లు అయిపోయినా, బోగిలో అపరిశుభ్రంగా మారినా పట్టించుకునే నాథుడు ఉండరు. తిరుపతి సికింద్రాబాద్ నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో చాలామంది ప్రయాణికులు మరుగుదొడ్లు నీళ్లు రావడం లేదని బోగీలు అపరిశుభ్రంగా ఉన్నాయని ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. ఇలా వివిధ రూట్లో తిరిగి ప్రత్యేక రైలు ప్రయాణ సమయాలు ఛార్జీలు రెగ్యులర్ రైళ్ల కంటే అధికంగా ఉంటున్నాయి.

ప్రత్యేక రైళ్లలో అదనపు బాదుడు


తరగతి....	కనిష్టం....	గరిష్టం
స్లీపర్	100	200 ఆపైన
త్రీ టైర్ ..	300	500 ఆపైన
సెకండ్ ఏసి	300 .	630 ఆపైన

శ్రీవారికి కాసుల పంట..!

- రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం
- డిసెంబర్ చివరికి రూ.1,350 కోట్లు దాటే అవకాశం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: శ్రీవారి హుండీ ఆదాయం నెల నెలా పెరుగుతోంది.. 33 నెలలుగా హుండీ ఆదాయం సెంచరీలు కొడుతోంది. తాజాగా ఆగస్టు లో హుండీ ఆదాయం రికార్డులు బద్దలు కొట్టింది. తిరుమలేశుడి హుండీ ఆదాయం ప్రతి నెలా రూ. వంద కోట్లకు తగ్గేదే లేదన్నట్లు వస్తోంది. వెంకన్న ఆదాయం అంతకంతకూ పెరుగుతోంది. ఈ ఏడాది మొదటి 10 నెలల్లో రూ 1142.43 కోట్లకు చేరింది. తిరుమల వెంకన్న ఆదాయం నవంబర్ నెలలో రూ 111.30 కోట్లు వచ్చింది. దీంతో తిరుమల శ్రీవారికి 11 నెలల ఆదాయం కాస్తా రూ.1253.73 కోట్లకు చేరుకుంది. ఈ మధ్య కాలంలో గణనీయంగా పెరిగిన భక్తుల రద్దీ తగ్గట్టుగానే హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో నమోదు అవుతోంది. శ్రీవారికి కానుకలు సమర్పించే భక్తులు తిరుమలేశుడి ఆస్తుల విలువను అమాంతంగా పెంచుతున్నారు. వెల కట్టలేని వజ్ర వైడూర్యాలు, బంగారు ఆభరణాలు వెంకన్న సొంతం. కాగా ఈ ఏడాది మొదటి 6 నెలల హుండీ ఆదాయం రూ 670.21 కోట్లుగా శ్రీవారి ఖాతాకు జమ అయ్యింది.

శ్రీవారి ఆదాయం రికార్డులను చూస్తే.. 2015-2016లో ఏకంగా రూ.1,010 కోట్ల సంవత్సర ఆదాయం లభించింది..




కరోనాకు ముందు బాగానే ఉన్న ఆదాయం ఆ తర్వాత తగ్గిపోయింది. ఇప్పుడు భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఆదాయం కూడా ఊహించని స్థాయికి చేరింది.

ఈ ఏడాది జనవరి నెలలో రూ.116.46 కోట్లు, ఫిబ్రవరిలో రూ.111.71 కోట్లు, మార్చి నెలలో రూ.118.49 కోట్లు, ఏప్రిల్ నెలలో రూ.101. 63 కోట్లు, మేలో రూ.108.28 కోట్లు, జూన్‌లో రూ. 113.64 కోట్లు, జులైలో రూ.125.35 కోట్లు, ఆగష్టులో రూ .25.67 కోట్లు, సెప్టెంబర్‌లో రూ .14.11 కోట్లు, అక్టోబరులో రూ.107.30 కోట్లు, నవంబరులో రూ .11.30 కోట్లు హుండీ కానుకల రూపంలో శ్రీవారి ఆదాయం టీటీడీ ఖాతాకు చేరింది.ప్రతి నెలా శ్రీవారిని దర్శించుకున్న భక్తులు, భక్తులు సమర్పించిన కానుకల వివరాలను డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. ఈ ఏడాదిలో అత్యధిక ఆదాయం ఆగస్టు నెలలోనే వచ్చినట్లు టీటీడీ లెక్కలు చెబుతున్నాయి. ఆగస్టు నెలలో శ్రీవారికి ఏకంగా 22.42 లక్షల మంది భక్తులు దర్శించుకోగా, శ్రీవారి హుండీ ఆదాయం రూ. 125.67 కోట్లు వచ్చినట్లు టీటీడీ ప్రకటించింది. ఆగస్టులో 1.06 లక్షల లడ్డూలను విక్రయించిన టీటీడీ 24.33 లక్షల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్లు ప్రకటించింది. గత 33 నెలలుగా తిరుమల వెంకన్న ఆదాయం రూ. 100 కోట్ల మార్కును దాటుతోంది. 2022 మార్చి నుంచి తిరుమలేశుడి హుండీ ఆదాయం ప్రతినెల రూ.100 కోట్లకు తగ్గకుండా టీటీడీ ఖాతాకు జమ అవుతూనే ఉంది. సామాన్య భక్తుల నుండి సంపన్నుడి దాకా హుండీలో సమర్పిస్తున్న కానుకల విలువ వెల్లువలా కొనసాగు తుండడంతో 2024 ఏడాది పూర్తి అయ్యే సరికి హుండీ ఆదాయం రూ. 1360 కోట్లకు పైగానే ఉంటుందని టిటిడి అంచనా వేస్తోంది.

భద్రతతో కూడిన విద్య

- బీసీ హాస్టళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు
- తిరుపతి బీసీ కళాశాల బాలిక హాస్టల్ సందర్శన
- 26 జిల్లాల్లోనూ బీసీ భవన్లు ఏర్పాటు
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : బీసీ హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా ప్రతి హాస్టల్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ ఇన్వెర్టర్లతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నా మని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. ఆదివారం నగరంలోని బీసీ బాలిక హాస్టల్‌ను మంత్రి సందర్శించారు. హాస్టల్లో ప్రతి గదిని, బాత్ రూమ్ లను, మరుగు దొడ్లను పరిశీలిం చారు. అనంతరం తనను కలిసిన విలేకరు లతో మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.39 వేల కోట్లకు పైగా ఎన్నడూ లేనంతగా బీసీల అభ్యున్నతికి అత్యధిక నిధులు కేటాయించామన్నారు. అందులో భాగంగా బీసీ హాస్టళ్ల మరమ్మతు లకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. నిరంతరం విద్యుత్ సదుపాయం ఉండేలా హాస్టళ్లలలో ఇన్వర్టర్లతో పాటు విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటూ విద్యార్థులను కంటకి రెప్పలా కాపాడుతు న్నామన్నారు.

26 జిల్లాల్లోనూ బీసీ భవనాల నిర్మాణం.. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ బీసీ భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బీసీ భవన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింద న్నారు. ఆ భవనాలన్నీ 70 నుంచి 80 శాతం పూర్తయ్యాయన్నారు. తరవాత వచ్చిన జగన్ ఆ నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బీసీ భవన్లతో పాటు కొత్త జిల్లాల్లోనూ నూతన భవనాలు నిర్మించ నున్నా మన్నారు. గత ప్రభుత్వం బీసీ హాస్టళ్లను కూడా గాలి కొదిలేశార న్నా రు. హాస్టళ్ల మరమ్మతులకు రూపాయి కూడా నిధు లివ్వ లేదని, చివరికి విద్యార్థుల డైట్ బిల్లులు కూడా చెల్లించలేదన్నారు.గత ఐదు ఏళ్ల బీసీలను అన్ని విధాలా అన్యాయం చేసి బీసీ ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రతి ఇంటి నుంచి ఓ వ్యాపార వేత్త..

బీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు అందించనున్నా మన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను రూపొందించేలా ప్రణాళికలు తయారు చేశా మన్నారు. తిరుపతిలోని బీసీ బాలికలను హాస్టల్ ను మంత్రి సందర్శించారు. పొట్టి శ్రీరాముల వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాద వ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.